# ఆశల ఆరాటంలో జీవన పోరాటం

జానకమ్మకి ఈ మధ్య ఒంట్లో బాగుండటం లేదు. మందులు వాడుతోంది. భర్త రామారావు కూడా పెద్దవారైపోవటం వల్ల బయటకు వెళ్లడం బాగా తగ్గించేసారు.

జానకమ్మ పూజా, వంట, భోజనాలయ్యాక ఏ రామాయణమో, భారతమో చదువుతూ గడి పేస్తుంది.

రామారావుగారి కాలక్షేపం కూడా పుస్త కాలే. ఏ భాషా పుస్తకాలైనా, వాటి అంతు చూసి వదలందే నిద్రపోరు. అందువల్లే రష్యన్, ఫ్రెంచ్, జర్మన్ భాషలను సొంతంగా నేర్చుకుని, ఆ భాషల్లోని చిన్న చిన్న కథలు, జోక్స్, కామిక్స్ ని ఇంగ్లీష్‌లోకి అనువదించటంతో సమయం గడిచిపోతుంది. ఆయనకు పరదేసి, జాషువా పద్యాలంటే చాలా యిష్టం. వాటిని అపుడపుడు రాగయుక్తంగా పాడుకుంటూ వుంటారు.

రామారావు జానకమ్మలకు ఐదుగురు సంతానం. ఒక కొడుకు, అందరి కన్నా పెద్ద వాడు, నలుగురు కూతుళ్లు. కొడుకుని డిగ్రీ చదివించాడు. ఉద్యోగంలో స్థిరపడ్డాడు. పెళ్లి చేసారు. భార్యా పిల్లలతో సుఖంగా వున్నాడు.

కాకపోతే తల్లిదండ్రులకొకటే బాధ. తనంత తానుగా తల్లిదండ్రులను, చెల్లె ళ్లను చూడడానికి రాడు. కనీసం ఉత్త రాలు కూడా రాయడు. జానకమ్మే... కొడుకుని చూడాలనిపించినపుడు రమ్మని ఉత్తరాలు రాయిస్తుంది. అదీ పది ఉత్తరాలు రాస్తే... ఏ పండక్కో ఒక్కరోజు వచ్చివెళతాడు.

ముగ్గురు కూతుళ్ల పెళ్లిళ్లు చేసారు రామా రావు, జానకమ్మ. పైసు కట్నం తీసుకోని, మంచి కుటుంబాలకు చెందిన అల్లుళ్లు దొరికారు. అత్తమామల నుంచి ఏమీ ఆశించకపోగా, వారి ని అల్లుళ్లు సొంత తల్లిదండ్రుల్లాగా చూసుకుం టారు. పెద్దమ్మాయి ఉద్యోగం చేస్తోంది. తరచూ తల్లిదండ్రులను చూడటానికి వస్తుంది. తల్లి దండ్రులు, చెల్లెళ్లకు, అన్ని విషయాలలో ఆస రాగా వుంటుంది.

* * *

భోజనాలయినాయి. రామారావుగారు వీధి గదిలో, పడక్కుర్చీలో పడుకుని పేపరు చదువు తున్నారు. జానకమ్మ మెల్లగా వచ్చి, ఆయన కెదురుగా కుర్చీలో కూర్చుంది. రామారావుగారి కర్థమయింది. ఆమె ఏదో మాట్లాడాలనుకుం టోందని. చదువుతున్న పేపరు మూసి... "చెప్పు జానకీ... ఏమిటి విషయం?" అన్నారు.


"అదే మన పక్కింటి శారదగారబ్బాయి అమెరికాలో ఉంటాడు కదా! అప్పుడప్పుడు... రెండేళ్లకొకసారో, మూడేళ్లకొకసారో తల్లి దండ్రులను చూడటానికి వచ్చిపోయేవాడు... మొన్నీమధ్య, వాళ్ల నాన్నగారు పోయినప్పుడు వచ్చాడుకదా! మనందరం శారదను అతనితో తీసుకెళతాడనుకున్నాం కదా! ఒక్కగానొక్క కొడుకాయె..."

"ఇప్పుడేమయింది జానకీ... అతను మళ్లీ వొచ్చాడా? తల్లిని తీసుకెళ్తున్నాడా?" అన్నారు.

"నా మొహం... అదేమీ కాదు. అక్కడికెళ్లాక ఏమైందో, ఏం ఆలోచించుకున్నాడో... నిన్న తల్లికి ఫోన్‌చేసి, నువ్విక్కడకొస్తే ఉండలేవమ్మా, మేమంతా బయటికెళ్లిపోతే నీకేమీ తోచదు. పైగా నీకు భాషరాదు. ఏదన్నా జబ్బుచేస్తే బోలెడు ఖర్చవుతుంది. అందుకని డబ్బుపంపిస్తాను. అలవాటైన చోటు, స్నేహితులున్నారు. నీకు కాలక్షేపమవుతుంది కనుక నీవు అక్కడే వుంటే బావుంటుందని చెప్పాడుట..." అంది జానకమ్మ.

'ఏం కోడుకో ఏమో... తండ్రి పోయాడు, అండగా వుండవలసిన కొడుకు డబ్బు పంపిస్తే చాలనుకుంటున్నాడు...' అని గొణుక్కుంది తనలో తనే.

ఈమధ్య జానకమ్మకి కొడుకు ధ్యాస ఎక్కువైందనుకున్నారు రామారావుగారు. ఆయనకూ అనిపిస్తోంది. కాని బయట పడటంలేదు. కొడుకు గురించి ఎలా అర్థం చేసుకోవాలో తెలియడంలేదు. అంటీ ముట్టనట్లుంటాడు. మాకు ఎప్పు



గొల్లమూడి పద్మావతి

దూ వాడిధ్యాసే, ఒక్కగానొక్క కొడుకు కదా? మరి వాడికలా మమ్మల్ని చూడాలని కాని, మాతో వుండాలని గాని అనిపించదేమో. లేకపోతే... తరుచూ వచ్చిపోతుంటే, బాధ్యతలన్నీ నెత్తిమీదపడతాయని భయమేమో? ముగ్గురి కూతుళ్ల పెళ్లిళ్లు చేసాము... ఏ సహాయం లేకుండా... అయినా... మేమేమిటో వాడికింకా అర్థంకాలేదు... అనుకున్నారు రామారావుగారు మనసులో. ఇదే విషయం బయటకంటే, జానకి యింకా డీలాపడిపోతుందని పైకేమీ అనలేదు.

ఎంతో కష్టపడి, స్వసుఖాలను కూడా పక్కన పెట్టి, పిల్లలను పెంచి పెద్దచేసి, విద్యాబుద్ధులు చెప్పించి, యింత వారిని చేస్తే ఈ రోజున వాళ్లకు తల్లిదండ్రులు భారంగా, మోయలేని బాధ్యతగా, వారి సుఖాని కడ్డంగా భావిస్తున్నారు. 'అడ్డాలనాడు బిడ్డలుగాని, గడ్డాలనాడు బిడ్డలా?' అని స్వగతంలో అనుకుంది జానకమ్మ.

'కానీ మన ప్రసాదరావుగారబ్బాయిని చూడండి... ఎంత బుద్ధిమంతుడో. తల్లిదండ్రులను వదిలిపెట్టి వుండడానికి ఇష్టపడటం లేదు. తనతో అమెరికా తీసుకెళతానంటున్నాడు. నేనెక్కడుంటే మీరూ అక్కడే వుండాలని... పట్టుపడుతున్నాడట. కష్టమైనా, సుఖమైనా కలిసే అనుభవించాలన్నాడట...' అంది జానకమ్మ.

* * *

ఈ సంభాషణ జరిగిన రెండో రోజున, పేపరు చదువుకుంటున్న రామారావుగారి దగ్గర కొచ్చిన జానకమ్మ... "నేనొకసారి శారద దగ్గర కెళ్లొస్తానండి... ఒంట్లో బాగాలేదట... పనమ్మాయి చెప్పింది. ఏమైనా అవసరమేమో... పాపం ఒక్కతే ఉంది..." అంది.

"సరే వెళ్లిరా..." అన్నారు రామారావుగారు.

'శారదా... జ్వరమొచ్చిందా...' అంటూ జానకమ్మ శారద పడగ్గదిలో కొచ్చింది. శారద ఒంటిమీద చెయ్యేసింది... కాలిపోతోంది. మందేమైనా వేసుకున్నావా!... కాఫీతాగావా?... నే కాఫీ తెస్తానుండు' అంటూ వంటింట్లో కెళ్లింది జానకమ్మ. రెండు నిముషాల్లో కాఫీ చేసి తీసుకొచ్చి, ఆమెతో తాగించింది.

'కొంచెం ఉప్మాచేసి తెస్తాను... ఏమీ తినకపోతే నీరసమొస్తుం'దని, ఆమె సమాధానానికి కూడా ఎదురు చూడకుండా ఇంటికి వచ్చి, రామారావుగారికి విషయం చెప్పింది. ఉప్మా చేసి తీసుకెళ్లి శారదకు పెట్టి, కొంచెం సేపు కూర్చుని, తిరిగి వచ్చింది.


రెండు రోజులకుగాని శారద జ్వరం తగ్గలేదు. ఈ రెండ్రోజులు శారదని జానకమ్మే చూసుకుంది.

మధ్యాహ్నం భోజనాలయ్యాక, శారదను చూసిపోదామని వచ్చిన జానకమ్మతో "జానకీ... ఈ రెండ్రోజుల నుంచి నేనొకటి ఆలోచిస్తున్నాను. ఇప్పుడంటే నువ్వు సాయం చేసావు. మళ్లీ ఇలాంటి పరిస్థితే వస్తే... నీ మీదే ఆధారపడాలి లేదా నీలాంటి మరొకరి మీద... ఎప్పటికైనా ఇది సమస్యే కదా?"

"అయితే ఏం చేద్దామనుకుంటున్నావు శారదా?..."

"ఈ మధ్య పేపర్లలో, టీవీలలో ఓల్డేజ్ హోమ్‌ల గురించి వింటున్నాము. రేపొకసారి నాకు తోడు వస్తావా? నిన్న పేపరులో చదివా నొక ఓల్డేజ్ హోమ్ గురించి... బాగుందట..." అంది శారద.

ఒంట్లో బాగుండనపుడు ఈ వయసులో తోడు లేకుండా ఉండలేము. ఇంటికి కావలసిన సమస్తమూ తెచ్చుకోవాలి. కరెంటు, టెలిఫోను




బిల్లులు కట్టాలి. నాకా ఓపిక తగ్గింది. ప్రతీసారీ వుండే పనికి ఎవరిమీద ఆధారపడతాం చెప్పు?... అక్కడ చేరితే నాకీ బాదరబందీ వుండదు కదా! అన్నీ సమయానికి వాళ్లే అమరుస్తారు. డాక్టర్లు కూడా వచ్చి చూస్తారుట. ఏమంటావు జానకీ..." అంది శారద.

శారద నిర్ణయం విన్న జానకికి చాలా బాధనిపించింది. రేపు తమ పరిస్థితేమిటో... వయసైపోయిన తల్లిదండ్రులను భారంగా భావించే పిల్లల్ని ఏమనాలో అర్థం కావటం లేదు.

పిల్లల్ని చదివిస్తే, రెక్కలొచ్చిన పక్షుల్లాగా ఎగిరిపోతారని, తమకు ఆసరా పోతుందని భావించి. పిల్లలను చదివించకపోతే వీరంతా ఈ రోజు ఈ స్థితికి చేరుకోగలిగేవారా శారదా... మనమిచ్చే ఆస్తిపాస్తులేమీ లేవుకదా అని, వారు స్వశక్తితో సంపాదించుకోగలిగిన స్థితికి తేవటమే మనం చేసిన తప్పేమో... అనుకుంది జానకమ్మ... కలచిన మనసుతో.

మర్నాడు మధ్యాహ్నం శారదా, జానకి ఓల్డేజ్ హోమ్‌కి వెళ్లారు. వివరాలన్నీ తెలుసుకున్నారు. బాగానే వుందనిపించింది యిద్దరికీ.

"జానకీ... యిక్కడ చేరిపోతాను... ఏమంటావు..." అంది శారద.

జానకేమంటుంది. శారదకు వేరే గత్యంతరం లేదు. ఆమె పరిస్థితికి చాలా బాధనిపించింది.

శారద... భర్త రిటైరయ్యాక వచ్చిన డబ్బులో కొంత ఓల్డేజ్ హోమ్‌కి విరాళంగా యిచ్చింది. దానితో వారు ఒక గది, బాత్రూమ్ కట్టిస్తారట. తన తదనంతరం, తనలాంటి మరొక అభాగ్యురాలికి ఉపయోగపడుతుందని ఆలోచించింది. ఈ నాగరిక ప్రపంచంలో తనలాంటి వారి సంఖ్య పెరుగుతోంది. అందుకని ఓల్డేజ్ హోమ్‌లు, వాటిలోని గదుల సంఖ్య పెరగవలసిన అవసరం ఎంతైనా వుందనుకుంది శారద.

మిగిలిన డబ్బులో కొంత కొడుకు పేరుమీద

బ్యాంకులో వేసి, పాసు పుస్తకంతో పాటు ఒక ఉత్తరం రాసి పెట్టింది. తల్లిప్రేమ మరి.

* * *

చివరి కూతురి పెళ్లి కూడా అయింది. రామారావు, జానకమ్మలు కొడుకు సహాయం, ఆదరణ లేకపోయినా దేవుడి దయవల్ల ఆడ పిల్లలను సవ్యంగా గట్టెక్కించగలిగామని తమ అదృష్టానికెంతో మురిసిపోయారు.

పెళ్లికొచ్చినవాళ్లు ఎక్కడివాళ్లక్కడకు వెళ్లిపోయారు. కొడుకు, కోడలు, మనవరాళ్లు కూడా చుట్టాల్లాగే వచ్చారు... వెళ్లారు.

* * *

మధ్యాహ్నం తీరుబడిగా రామారావుగారెదురుగా కూర్చుంది జానకమ్మ. "ఏమండీ... ఇన్నాళ్లు మన బాధ్యతలన్నీ వాడిమీద పడతాయని భయపడ్డాడనుకుందాం. ఇప్పుడు బాధ్యతలన్నీ తీరినట్లే. వాడేమీ మనలను పోషించక్కర్లేదు. మీకా... ఏమీ చేతకాదు. నేను మూల పడితే మీకు సహాయం అవసరం. వెళ్లి అబ్బాయి దగ్గర వుందామండీ..." అంది జానకమ్మ.

"పిచ్చిదానా... నాకు మాత్రం కొడుకు దగ్గరుండాలని లేదా! నువ్వెంత ఆశపడుతున్నావు, కానీ... వాడు మనల్ని తన దగ్గరుండమని ఎప్పుడైనా పిలిచాడా! నువ్వు తాపత్రయపడటమే గాని..." అన్నారు రామారావుగారు.

జానకమ్మ గుడ్లనీరు కుక్కుకుంటూ... "ఆశ పడటంలో తప్పేమిటండీ... ఒక్కగానొక్క కొడుకు... ఎంత ప్రేమగా పెంచుకున్నాము... వాడెందుకలా మారిపోయాడు?... వాడికి మన మీద అసలు ప్రేమలేదా?... వాడికి మనమేం తక్కువ చేసాం? ఆస్తిపాస్తులేమీ యివ్వలేదని కోపమా!"

"మనకుంటేకదా... వాడికివ్వటానికి. మన శక్తికొలదీ చదివించి, మంచిస్థితికి తేగలిగాము. అంతకంటే మనమేం చేయగలం? చూద్దాం... ఎప్పటికైనా వాడిలో మార్పొస్తుందేమో..." అన్నారు రామారావుగారు.

రోజులు గడిచిపోతున్నాయి. ఏమార్పూ లేదు. కొడుకెప్పుడు పిలుస్తాడా అని ఆశతో జానకమ్మ రోజులు గడిపేస్తోంది.

రోజూలాగే ఆ రోజూ తెల్లారింది. రోజువారీ కార్యక్రమాలు యధావిధిగా జరిగిపోయాయి. రామారావుగారు వీధి వాకిట్లో పడక్కుర్చీలో పడుకుని పుస్తకం చదువుతున్నారు. టైము ఆరైంది. కాఫీ యివ్వలేదు జానకమ్మ.

పిలిచారు... "జానకీ... జానకీ..." అని. సమాధానం లేదు. కాసేపు చూసి లేచి లోపలికి వెళ్లారు... నిద్రపోతున్నట్లుంది... ఈ వేళప్పుడింకా నిద్రేమిటని, లేపటానికి దగ్గరకెళ్లారు. అనుమానమొచ్చింది. శరీరం తాకితే చల్లగా తగిలింది. మ్రాన్పడిపోయారు.

'జీవితంతో అనేక రకాలుగా పోరాడి, కొడుకింకా పిలుస్తాడు, రేపో... మాపో అని ఎంతో ఆశగా ఎదురుచూసావు. నీ ఆశ నెరవేరుతుందని నేను భావించలేదు. కాని నీ ఆశ నెరవేరాలని, నీ బాధ చూడలేక, ఎప్పుడూ ఏమీ కోరని దేముడిని ఎన్నోసార్లు వేడుకున్నాను. పోనీలే... ఇప్పటికైనా నీ శరీరానికి విశ్రాంతి దొరికింది. నీ ఆత్మకు శాంతి కలగాలి జానకీ...' రామారావుగారి కళ్లను నీటిపొర కమ్మేసింది.

'వీడిప్పుడొచ్చి, అన్ని కార్యక్రమాలూ చేసినా, ఆమెకు తెలుస్తుందా?... ఆత్మలుంటాయన్నది నిజమైతే, ఆమె ఆత్మైనా సంతోషిస్తుందేమో...' అనుకుంటూ ఫోన్ దగ్గరకు వచ్చారు... కొడుక్కి తెలియపర్చడానికి. ●